తెల్లారితే పెండ్లి .. వరుడి ఆత్మహత్య

- జగిత్యాల జిల్లా రామచంద్రంపేటలో విషాదం

కిరణ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి 8: ఆ ఇంట్లో తెల్లారితే పెండ్లి .. ఓ వైపు పెండ్లి పనులు కొనసాగుతున్నాయి. ఇంతలోనే పెండ్లి కొడుకు ఉరేసుకొని ఆత్మహత్య .. ఈ విషాదకర ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల అనుబంధ గ్రామం రామచంద్రంపేటలో చోటుచేసుకున్నది. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..రామచంద్రంపేటకు చెందిన లక్కంపెల్లి కిరణ్(37) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వెల్లుల్లకు చెందిన యువతితో ఈనెల 9న వివాహం నిశ్చయించారు. శుక్రవారం రాత్రి కిరణ్ తన గదిలో పడుకోగా,శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా కిరణ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కిరణ్‌కు ఆరోగ్య సమస్యలు ఉండడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

కోతులకు కళ్లెం వేసేదెలా..?

- నిర్మల్‌లోని రెస్క్యూ సెంటర్‌లో పెరగని స్టెరిలైజేషన్లు
- నిధుల కొరతతో సహకరించని స్థానిక సంస్థలు
- నాలుగేళ్లలో 1547 స్టెరిలైజేషన్లు
- బీఆర్ఎస్ హయాంలోనే మొదటిసారిగా సెంటర్ ఏర్పాటు

నిర్మల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోజురోజుకూ కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో వాటి ఆగడాలు తాళలేక ప్రజలతోపాటు రైతులు బెంబేలెత్తుతున్నారు. వీటి సంతాన ఉత్పత్తి ప్రక్రియ వేగంగా కొనసాగుతూ ఉండడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతుంది. రాత్రింబవళ్లు వీటి సంచారంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే పొలాలపై కూడా కోతుల గుంపులు దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ఈ సమస్యపై గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో నిర్మల్ శివారులోని గండిరామన్న హరితవనం ప్రాంగణంలో రాష్ట్రంలోనే ఏకైక మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అయితే వన్యప్రాణుల రక్షణ చట్టానికి అనుగుణంగా కోతులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒక డాక్టర్‌తోపాటు ఫార్మాసిస్టు, నలుగురు అటవీ సిబ్బందిని నియమించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు కోతులను పట్టించి ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌కు తీసుకొస్తే వాటికి స్టెరిలైజేషన్(కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. అయితే నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల నిర్లక్ష్యం కారణంగా కేవలం 1547 స్టెరిలైజేషన్లు మాత్రమే చేశారు. ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో నెలకు దాదాపు 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో కోతిని పట్టేందుకు రూ.1000 వరకు ఖర్చు అవుతుండడంతో అసలే నిధుల కొరతతో సతమతమవుతున్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇది మరింత భారంగా మారింది. కోతుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, నిధుల కొరత కారణంగా వాటిని పట్టించే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు మాజీ సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు పేర్కొంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ చూపి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వీడీసీలు ముందుకు రావాలి..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో కొనసాగుతున్న వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)లు కోతుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వీడీసీలు సమాంతర వ్యవస్థ నడుపుతుండడమే కాకుండా అక్కడి ఆర్థిక వనరులన్నింటినీ తమ గుప్పిట్లో ఉంచుకున్నాయన్న వాదనలున్నాయి. గ్రామ పంచాయతీల కన్నా వీడీసీలే ఆర్థికంగా బలంగా ఉండడంతో కోతుల తరలింపు బాధ్యతను కూడా ఆయా వీడీసీలే తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టాటూలతో స్టెరిలైజేషన్ గుర్తింపు ఈజీ..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేసిన కోతులకు ఇక్కడి వైద్య సిబ్బంది వాటి నుదుటిపై టాటూలు వేస్తున్నారు. ఇలా టాటూలు కనిపించిన కోతికి స్టెరిలైజేషన్ పూర్తయినట్లు ఈజీగా తెలిసిపోతుంది. స్టెరిలైజేషన్ పూర్తయిన కోతులకు ఇక సంతానోత్పత్తికి అవకాశం ఉండదు. దీంతో క్రమంగా వాటి సంఖ్యను తగ్గించవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. 2 నుంచి 3 ఏళ్ల వయసు ఉండడం లేదా వయసు తక్కువగా ఉన్నప్పటికీ బలంగా ఉన్న కోతులకు స్టెరిలైజేషన్ చేస్తున్నారు.

సౌకర్యాలు ఉన్నాయి.. సద్వినియోగం చేసుకోండి..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ రిహాబిటేషన్ సెంటర్‌లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి సెంటర్ నిర్వహణకు వైద్యుడితోపాటు అవసరమైన మేరకు సిబ్బంది కూడా ఉన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చొరవ తీసుకుని కోతులను పట్టించి సెంటర్‌కు తీసుకురావాలి. ప్రతినెల 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. కోతుల సంతానాన్ని నిరోధించాలంటే స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం.

–డాక్టర్ శ్రీఖర్‌రాజు, మంకీ రెస్క్యూ సెంటర్ మెడికల్ ఆఫీసర్, నిర్మల్.

నవీపేటలో కిటకిటలాడుతున్న మేకల అంగడి

మేకల అంగడి @ రూ.4 కోట్లు

- నవీపేటలో జోరుగా జీవాల క్రయవిక్రయాలు

నవీపేట, మార్చి 8: నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల అంగడిలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన మేకలు, గొర్రెల క్రయ విక్రయాలతో రూ.4 కోట్లకుపైగా వ్యాపారం జరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 14న హోలీ పండుగతోపాటు వరుసగా వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో అంగడికి మరింత డిమాండ్ పెరిగింది. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పుణె, ఉత్తరప్రదేశ్, హర్యానా, కర్ణాటక, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద మొత్తంలో జీవాల క్రయ విక్రయాలు చేపట్టారు. జీవాలతో అంగడి కిక్కిరిసిపోవడంతో బాసర రోడ్డు పైనే క్రయ విక్రయాలు కొనసాగాయి.

రోడ్డుపై గుంతలను పూడ్చి వేయిస్తున్న పీఆర్ ఈఈ, సీఐ, ఎస్సై

ఎట్టకేలకు ఉచిత రవాణా

నమస్తే ఎఫెక్ట్

'నమస్తే కథనం'తో దారి దోపిడీకి చెక్

టేకుమట్ల, మార్చి 8 : అంతర్ జిల్లాలను కలిపే మానేరు వాగుపై ఎట్టకేలకు ఉచిత రవాణ కొనసాగుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి– పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడెడు గ్రామాల మధ్య మానేరువాగులో అక్రమ వసూళ్ల దందాపై ఈ నెల 1న 'దర్జాగా దారి దోపిడీ' కథనం 'నమస్తే తెలంగాణ' మొయిన్‌లో ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీంతో అధికారులు టోల్ తీసేశారు. దీనిని జీర్ణించుకోలేని దుండగులు మట్టిరోడ్డుపై గుంతలు తవ్వి రవాణాకు ఆటంకం కలిగించారు. దీంతో 'మానేరు వాగులో రోడ్డుపై గుంతలు' కథనం శుక్రవారం జిల్లా పేజీలో వచ్చింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. శనివారం పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, టేకుమట్ల ఎస్సై సుధాకర్ వాగును సందర్శించి రోడ్డుపై తవ్విన గుంతలను జేసీబీతో పూడ్చివేయించారు. ఎవరైనా రోడ్డును ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటకెక్కిన చేనేత పథకాలు !

- వచ్చే బడ్జెట్‌లోనూ నేతకార్మికులకు మొండి చెయ్యి తప్పదా..?
- సంక్షేమ బోర్డుకు రూ.1000 కోట్లు ఏవని ప్రశ్నిస్తున్న నేతలు
- రూ.5 లక్షల పెట్టుబడి సాయం మరిచిన కాంగ్రెస్ సర్కార్
- రేవంత్ తీరుపై కార్మికుల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత రంగాన్ని కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేతలతోపాటు పవర్ కార్మికులనూ కష్టాలపాలు చేసింది. విజయవంతంగా కొనసాగుతున్న వస్త్ర కార్మికుల పథకాలను రద్దు చేసింది. బీఆర్ఎస్ హయాంలో ఆదరణ పొందిన బతుకమ్మ చీరల పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కడంతోపాటు ఏకంగా ఆ పథకాన్నే రద్దు చేశాడు. దీంతో వస్త్ర కార్మికులకు రాష్ట్రంలో ఉపాధి లేకుండా పోయింది. పనులు లేక, మగ్గాలు నడువక, పస్తులు ఉండలేక నేత కార్మికులకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి.

'రెండు చీరల' పథకం అమలు ఎప్పుడు..?

బతుకమ్మ చీరల పథకం బదులుగా 'రెండు చీరల' పథకం ప్రవేశ పెట్టినట్టు సర్కారు పేర్కొన్నది. ఇంత వరకు దాని ఊసే లేదు. పైగా ఈ పథకం అమలుకు రూ.400 కోట్లకుపైగా కేటాయిస్తున్నామని, ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి తెస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాని ఇప్పటికీ నేతన్నలకు చీరల తయారీ బాధ్యతలూ ఇవ్వలేదు. పైగా ఈ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత చేయూత పథకంతోపాటు త్రిఫ్ట్ పథకాన్ని, నూలు రంగులకు నగదు బదిలీని కూడా రద్దు చేసింది.

నిధులు పెంచండి: నేత కార్మికులు

2025-26 ఆర్థిక సంవత్సరంలో అయినా వస్త్ర పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని, సబ్సిడీల అమలుతోపాటు రూ.1000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకుడు చెర్కు స్వామి, తెలంగాణ పవర్ లూమ్ కార్మిక సంఘం నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. ప్రతి నేత కార్మికుడికి రూ.5 లక్షల బీమా, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇండ్లు లేని కార్మికులకు హౌస్ కం వర్క్‌షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. టెస్కో ద్వారా చేనేత సహకార సంఘాలలో నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు చేసి, నిధులు విడుదల చేయాలని కోరారు.

ఫాల్కన్ స్కామ్ నిందితుడి విమానం సీజ్

శంషాబాద్ రూరల్, మార్చి 8: ఫాల్కన్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ చార్టర్డ్ విమానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీజ్ చేసింది. దుబాయ్ నుంచి ఆ విమానం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చినట్టు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి వెళ్లి సీజ్ చేసినట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. ఫాల్కన్ కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్ము నుంచి అమర్‌దీప్ రూ.14 కోట్లు వెచ్చించి ఆ విమానాన్ని కొనుగోలు చేసినట్టు గుర్తించామని తెలిపారు. అమర్‌దీప్ సహా ఈ స్కామ్‌లోని కీలక నిందితులు పరారీలో ఉన్నారని, ప్రస్తుతం పవన్, కావ్య అనే ఇద్దరు వ్యక్తులను మాత్రమే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పెట్టుబడుల పేరుతో 6,979 మందిని మోసగించి రూ. 1,700 కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాల్కన్ గ్రూప్‌పై కేసు నమోదైన విషయం విదితమే. దీన్ని ఆధారంగా ఈడీ దర్యాప్తు జరుపుతోంది.

అల్ఫ్రాజోలం పట్టివేత

అక్రమంగా అల్ఫ్రాజోలం అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

కామారెడ్డి, మార్చి 8 : అక్రమంగా రవాణా చేస్తున్న 250 గ్రాముల అల్ఫ్రాజోలంను పట్టుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా అల్ఫ్రాజోలంను తరలిస్తున్నట్లుగా సమాచారం రావడంతో శనివారం దాడి చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కామారెడ్డికి చెందిన ముధు సూదన్ చారి, తాండూరు మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన భూమా విఠల్ గౌడ్, గుండారం వెంకాగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరు ముగ్గురు సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామానికి చెందిన సురేశ్‌గౌడ్ వద్ద అల్ఫ్రాజోల కొనుగోలు చేశారు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు. ముగ్గురితో పాటు విక్రయదారుడు సురేశ్‌గౌడ్‌పై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ స్వప్న, ఎస్సైలు రాంకుమార్, విక్రమ్ కుమార్, సిబ్బంది హమీద్, విష్ణు, అవినాష్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

మహిళలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

రాజంపేట్, మార్చి 8 : మండలంలోని గుండారం గ్రామసంఘంలో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా బ్యాంకింగ్ సేవల గురించి, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై శనివారం మహిళా సభ్యులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సేవా సంస్థ కౌన్సిలర్లు రాజు, ఆనంద్‌రెడ్డి, వీవోఏ స్వప్న, గ్రామ సంఘం అధ్యక్షుడు, వివిధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనతండా వాసి అదృశ్యం

నిజాంసాగర్, మార్చి 8 : మహ్మద్‌నగర్ మండలం కొనతండాకు చెందిన బోడ ప్రేమ్‌సింగ్(38) అదృశ్యమయ్యాడు. మూడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని, ఇంతకు ముందు కూడా ఇలాగే వెళ్లి వస్తూ ఉండేవాడని, అతడి భార్య గంగూబాయి శనివారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివకుమార్ తెలిపారు.

- రోడ్లపై పారుతున్న మురికి నీరు
- డ్రైనేజీల నిండా చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మండలంలోని బీటీఎస్ వద్ద జ్యోతిబా పూలే పాఠశాల ఎదుట డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జంగంపల్లి నుంచి తలమడ్లకు వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న మురికి నీరు

44వ నంబర్ జాతీయ రహదారి పక్కన డ్రైనేజీలో నిలిచిన మురికినీరు, చెత్త

డ్రైనేజీలు అస్తవ్యస్తం

భిక్కనూరు, మార్చి 8 : మండలంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోడ్లపై మురికి నీరు పారుతున్నది. డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక అధికారులను నియమించింది. సరైన నిధులను అందజేయకపోవడంతో వారు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జంగంపల్లి గ్రామం నుంచి రాజంపేట మండలం తలమడ్ల గ్రామ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో చాలా రోజులుగా డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతున్నది. అక్కడ మురికి కాలువ నిర్మించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. వ్యాధులు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. తొలగించే వారు కరువయ్యారు.

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల ఎదుట 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన డ్రైనేజీని చాలా రోజులుగా శుభ్రం చేయడం లేదు. అందులో చెత్తాచెదారం పేరుకుపోయింది. రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఎదురుగా ఏదైనా పెద్ద వాహనం వస్తే రోడ్డు పక్కకు దించడంతో అక్కడ లోతైన గుంతలు ఏర్పడగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రులు మందలించారని పురుగుల మందు తాగిన యువకుడు

చికిత్స పొందుతూ మృతి

సాయికృష్ణ (ఫైల్)

నాగిరెడ్డిపేట, మార్చి 8: తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు ఇంట్లో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో తాండూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అచ్చన్నపల్లి సాయికృష్ణ (21) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల19న గ్రామంలో బోనాల పండుగకు ఇంటికి వచ్చాడు. తండ్రి విఠల్, తల్లి సాయమ్మ కుమారుడిని ఏం పని చేస్తున్నావు, ఎక్కడ చేస్తున్నావు, బాధ్యత లేకుండా తిరుగుతున్నావంటూ మందలించారు. మనస్తాపానికి గురైన సాయికృష్ణ గతనెల 21న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మంజీరా నది బ్రిడ్జిపై నుంచి దూకి ఒకరి ఆత్మహత్య

మృతి చెందిన చిన్న సాయిలు

పెద్దకొడప్‌గల్(పిట్లం), మార్చి 8 : మంజీరానది బ్రిడ్జిపై నుంచి దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం... రుద్రూర్ గ్రామానికి చెందిన జిల్లాపురం చిన్న సాయిలు (48) కొంతకాలం నుంచి ఎటువంటి పని చేయకుండా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. జీవితం మీద విరక్తిచెంది పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి శివారులో మంజీరా బ్రిడ్జిపై నుంచి దూకి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయిలు భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

మాట్లాడుతున్న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి, మార్చి 8 : ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నర్సి పట్టణానికి చెందిన షేక్ ఇమ్రాన్ ఇస్మాయిల్, షేక్ వాజిద్ మూడేండ్లుగా కామారెడ్డి పట్టణంతోపాటు దేవునిపల్లి ఏరియాల్లోని పలు ఇండ్లల్లో చోరీలు చేశారని చెప్పారు. చోరీ చేసిన సొత్తును దెగ్లూర్ ఏరియాలోని వ్యక్తులకు విక్రయించినట్లు తెలిపారు. దాదాపు 30 నుంచి 40 ఇండ్లలో చోరీలు చేసినట్లుగా ఒప్పుకున్నారన్నారు. శనివారం ఉదయం కామారెడ్డిలో చోరీ చేసేందుకు వచ్చిన వీరిని రైల్వేస్టేషన్ ఏరియాలో పట్టుకున్నామన్నారు. వీరిని పట్టుకోవడంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై ఉస్మాన్, సిబ్బంది సురేందర్, రవి, గణపతి, శ్రవణ్, రాజేందర్, కిషన్, రూరల్ సీఐ, రూరల్ ఎస్సైలు, సిబ్బందిని ఎస్పీ, ఏఎస్పీ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాచారెడ్డి, మార్చి 8 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కాకులగుట్టతండా గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. బండరామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం దాడి చేశామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మాచారెడ్డి, మార్చి 8 : మండలంలోని ఘన్‌పూర్ శివారు ప్రాంతంలో పేకాడుతున్న నలుగురిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురు నుంచి రూ.2,020, మూడు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హోంగార్డుపై ఎస్పీకి ఫిర్యాదు

లింగంపేట(తాడ్వాయి), మార్చి 8: తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు దేమి గంగారాంపై ఎస్పీకి శనివారం ఫిర్యాదు చేసినట్లు తాడ్వాయి గ్రామానికి చెందిన కుర్మ పాల్వంచ సాయన్న తెలిపారు. ఈ నెల 4న గంగారాం తనను అకారణంగా దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో దూషించడంతో తన పరువు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హోంగార్డుపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు బహుమతులు అందజేత

కామారెడ్డి, మార్చి 8 : జిల్లా కేంద్రంలోని శ్రీసాందీపని జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పదోతరగతి ప్రతిభా పరీక్షలో విజేతలకు సౌత్ క్యాంపస్ ప్రొఫెసర్ అంజయ్య శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాందీపని కళాశాల డైరెక్టర్ బాలాజీరావు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు నరసింహారావు, డాక్టర్ వేదప్రకాశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ రమేశ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రేణుక, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి

మంజీరా వాగులో మునిగి మృతి

నాగిరెడ్డిపేట, మార్చి 8: మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చీనూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ (28) శుక్రవారం ఉదయం 11గంటల ప్రాంతంలో సమీపంలోని మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బైక్‌పై వెళ్లాడు. రాత్రి వరకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో వెళ్లి చూడగా ఆచూకీ లభించలేదు. ఉదయం వాగు ఒడ్డున బట్టలు, చెప్పులు, బైకు కనిపించినట్లు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా వాగునీటిలో శవమై కనిపించాడు. ఉస్మాన్‌కు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు తండ్రి హుస్సేన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి శవానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఆయన చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.